సాక్షి వికారాబాద్

శనివారం । 23 । నవంబర్ । 2024



వ్యాధులపై అప్రమత్తత..

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పకీరప్ప విద్యార్థులకు సూచించారు. 8లో▸



సంచుల కొరత ఉండొద్దు

రైతులకు గోనె సంచుల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. 8లో▸



అన్యాయం చేస్తే ఊరుకోం

లగచర్లలో గిరిజన రైతుల భూములను గుంజుకుంటే ఊరుకునేదిలేదని ప్రహ్లాదరావు, జానకిరాం అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

పరిగి ఏఎంసీగా పరశురాంరెడ్డి

వైస్ చైర్మన్‌గా ఆయూబ్



పరుశురాంరెడ్డి

పరిగి: పరిగి మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా సయ్యద్ ఆయుబ్ హుస్సేన్‌తో పాటుగా 12 మంది డైరెక్టర్లతో కలసి నూతన పాలకవర్గం కొలువుదీరనుంది. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ అన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత మాక్ టెస్టులు

మైనారిటీ సంక్షేమ అధికారి హనుంతరావు

అనంతగిరి: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షల్లో పాల్గొనే మైనారిటీ అభ్యర్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సి మరియు బౌద్ధులు) కొరకు ఆఫ్‌లైన్‌లో ఉచిత మాక్‌టెస్టులు నిర్వహించనున్నట్లు మైనారిటీ సంక్షేమ అధికారి హనుంతరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 29లోపు వికారాబాద్ కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో ఉన్న ఎస్-17 మైనారిటీ కార్యాలయంలో సమర్పించాలి. వివరాలకు 9912740115 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లగచర్లలో ఎస్పీ పర్యటన



దుద్యాల్-లగచెర్ల మార్గంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

దుద్యాల్: లగచర్ల ఘటన నేపథ్యంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు వసతి ఏర్పాటు చేసేందుకు ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించారు. లగచర్ల పంచాయతీ కార్యాలయం, పాఠశాల, దుద్యాల్ సమీపంలోని ఆశ్రమంలో గదులను పరిశీలించారు. లగచర్ల సమస్య సద్దుమణిగే వరకూ పోలీసులు ఇక్కడే విధులు నిర్వహించేందుకు అన్ని వసతులు కల్పించేందుకే ఎస్పీ పర్యటించినట్లు సమాచారం. ఈ నెల 11న ఘటన జరిగిన అనంతరం లగచెర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంటతండాల రైతులను పరామర్శించేందుకు నిత్యం వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వస్తున్న విషయం విధితమే. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు లగచెర్ల గ్రామంతో పాటు శివారులో రెండు వైపులా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. నిత్యం రెండు బ్యాచ్‌లుగా పోలీసులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్పీ నారాయణ రెడ్డి లగచర్లకు వస్తున్నారనే విషయాన్ని పోలీసులు మీడియాకు తెలిపలేదు. అందుబాటులో ఉన్న కొంతమంది మీడియా ప్రతినిధులు కవరేజ్‌కు వెళ్లగా ఫొటోలు తీయొద్దని చెప్పడం గమనార్హం.

నేడు బీటీ రోడ్డు ప్రారంభోత్సవం

పూడూరు: మండల పరిధిలోని బాకాపూర్, చింతలపల్లి గ్రామాల్లో బీటీ రోడ్డు ప్రారంభించేందుకు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి విచ్చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు బాకాపూర్, 12 గంటలకు చింతలపల్లి గ్రామాలకు వేసిన బీటీ రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరవ్వాలన్నారు.

సీసీఐ కేంద్రాలను వినియోగించుకోవాలి

రంగారెడ్డి డీఏఓ నర్సింహారావు

చేవెళ్ల: పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని దామరగిద్ద సమీపంలో ఉన్న శ్రీనివాస కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తిని ఎలా కొనుగోలు చేస్తున్నారు.. ఎలా తూకం వేస్తున్నారు.. తేమశాతం ఎలా చెక్ చేస్తున్నారనే విషయాలను స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. మద్దతు ధరలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు అందుబాటులో ఉంటారని రైతులకు ఏవైనా సమస్యలుంటే వారిని సంప్రదించాలని సూచించారు. పత్తి అమ్మకానికి తెచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ధారూరు: నల్లా వద్ద చన్నీటితో విద్యార్థుల స్నానాలు

చలి పంజా.. విద్యార్థులు గజగజ

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు
- విరిగిన తలుపులు, పగిలిన కిటికీలు
- దుప్పట్ల పంపిణీ అంతంత మాత్రమే

చలి పంజా విసురుతున్నా సంక్షేమ హాస్టళ్లను సర్కార్ పట్టించుకోవడం లేదు. కిటికీలు, తలుపులు ధ్వంసమై చల్లని గాలులతో వసతి గృహ విద్యార్థులు గజ గజ వణుకుతున్నారు. చన్నీటి స్నానం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో 'సాక్షి' ఆయా సంక్షేమ హాస్టళ్లలో గురు, శుక్రవారాల్లో విజిట్ నిర్వహించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటర్ హీటర్లు, గీజర్లు ఏర్పాటు చేయక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోయారు.

చర్యలు శూన్యం

యాలాల: మండల కేంద్రంలో బీసీ బాలుర, బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలు, ఓ కేజీబీవీ పాఠశాల ఉంది. శీతాకాలం నేపథ్యంలో ఇప్పటికే అన్ని వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాగా బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల గదుల్లో ఏర్పాట్లు అధ్వాన్నంగా ఉండటంతో చలితో ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు రాత్రిళ్లు బస చేసే గదులకు విరిగిపోయిన తలుపులు, రెక్కలు లేని కిటికీలు ఉండటంతో చలికి వణికి పోతున్నారు. దీంతో విద్యార్థులు విరిగిన తలుపులకు సంచులు అడ్డుగా పెట్టి తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. దీనికి తోడు ఆయా వసతి గృహాల్లో విద్యార్థులకు వేడినీళ్లు అందించేందుకు గీజర్లు సైతం ఏర్పాటు చేయలేదు. బీసీ బాలుర వసతి గృహంలో సుమారు 60 మంది విద్యార్థులున్నప్పటికీ, గదులు, ఇతర వసతుల ఏర్పాట్లలో సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.



బీసీ బాయ్స్ హాస్టల్‌లో విరిగిన తలుపునకు అడ్డుగా ఏర్పాటు చేసుకున్న గోనెసంచి



యాలాల: బీసీ బాలుర హాస్టల్‌లో కిటికీ దుస్థితి

గతేడాది దుప్పట్లతోనే సరి

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి కేజీబీవీ హాస్టళ్లలో 475 మంది బాలికలు 6 నుంచి 10వ తరగతి చదువుకుంటున్నారు. వీరికి ఈ సంవత్సరం బెడ్‌షీట్లు, దుప్పట్లు అందలేదు. దీంతో గత సంవత్సరంలో పంపిణీ చేసిన బెడ్‌షీట్లు, దుప్పట్లతోనే సరిపెట్టుకుంటున్నారు. ఈ ఏడాది కొత్తగా అడ్మిషన్ అయిన విద్యార్థులు ఇంటి నుంచి బెడ్‌షీట్లు, దుప్పట్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు. కోట్‌పల్లి కేజీబీవీలో వేడి నీళ్ల అందుబాటులో లేకపోగా బంట్వారంలో సోలార్ హీటర్ ద్వారా వేడి నీళ్ల వినియోగిస్తున్నారు.

ఈ ఏడాది రాలే..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు 410మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వం నుంచి గతేడాది 450మంది విద్యార్థులకు దుప్పట్లు, చెప్పులు, షూ ఇచ్చారు. కాగా ఈ ఏడాది గిరిజన సంక్షేమశాఖ నుంచి రావాల్సిన దుప్పట్లు ఇంకా రాలేదని త్వరలోనే వచ్చే అవకాశం ఉందని హెచ్‌ఎం విక్రమ్‌సింగ్ తెలిపారు.



బొంరాస్‌పేట: ఆశ్రమ పాఠశాలలో దుప్పటిని చూపుతున్న విద్యార్థినులు

సౌకర్యాల కల్పనలో విఫలం



కుల్కచర్ల: బీసీ హాస్టల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో విద్యార్థులు

కుల్కచర్ల: చలికాలం రావడంతో వసతిగృహాలలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా చలిగాలుల తీవ్రత పెరగడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. మండల పరిధిలోని మూడు బీసీ, నాలుగు గిరిజన వసతి గృహాల్లో ప్రభుత్వం పంపిణీ చేసే దుప్పట్లు అందలేదు. గిరిజన గురుకులం, కస్తూర్బాలోనూ చలికాలం ప్రత్యేకంగా ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

వేడి నీటి పంపిణీ

మోమిన్‌పేట: రాష్ట్రంలో చలి పంజా విసురుతుండడంతో వసతి గృహ విద్యార్థులకు శుక్రవారం నుంచి వేడి నీళ్లు ఇస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన బెడ్ షీట్లను పంపిణీ చేశారు. హాస్టల్ గదిలోని ఒక కిటికీకి రెక్కలు లేక చలి వణికిస్తోంది. 56మంది విద్యార్థులున్న హాస్టల్‌లో ఆరు మరుగుదొడ్లు, ఆరు స్నానాల గదులున్నాయి. దీంతో విద్యార్థులకు కొంత ఇబ్బందిగా మారింది.



నీళ్లు వేడి చేస్తున్న హాస్టల్ సిబ్బంది

వసతులున్నాయి



వసతి గృహంలో అన్ని వసతులు బాగానే ఉన్నాయి. వేడి నీళ్లు గతంలో ఇవ్వలేదు. శుక్రవారం నుంచి వేడి నీళ్లు ఇస్తున్నారు. బెడ్ షీట్లు ఇచ్చారు. ఫ్యానులు సక్రమంగానే పని చేస్తున్నాయి. మరుగుదొడ్లు సరిపడా లేక ఇబ్బంది పడుతున్నాం.

– అరవింద్, పదవ తరగతి, ఎస్సీ బాలుర వసతిగృహం మోమిన్‌పేట.

కొనుగోలు.. కొర్రీలు

- తేమ, తాలు పేరిట తిప్పి పంపుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు
- రైతన్నకు ఇబ్బందులు
- ప్రభుత్వ లక్ష్యంలో కొన్నది రెండు శాతం.. కంప్యూటరీకరణ ఒక శాతం
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు



యాలాల మండల పరిధిలో రైతులు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం

వికారాబాద్: ఓ పక్క కొనుగోలు కేంద్రాల నిర్వహకుల కొర్రీలు.. మరో పక్క నగదు జమలో ఆలస్యం తదితర కారణాలతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. వెరసి దళారులకే ధాన్యం అమ్మాల్సిన పరిస్థితి. తేమ, తాలు పేరిట కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను పదే పదే తిప్పి పంపుతుండటంతో చేసేదిలేక ధాన్యం కల్లాల్లోనే పెట్టుకుని పడిగాపులు గాస్తున్నారు. చివరకు దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఉన్నతాధికారులు, ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం మారడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ పర్యవేక్షిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లకే కొమ్ముకాస్తుండడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. పంట దిగుబడి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం గణాంకాలు చూస్తే రైతులు ఏమేరకు దళారులను ఆశ్రయిస్తున్నారో ఇట్టే తెలిసిపోతోంది. కొందరు రైతులు ధర తక్కువరైనా దళారులకే ధాన్యం విక్రయిస్తుండగా.. మరి కొందరు కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల షరతులకు తలొగ్గి వారు వేసిన తూకానికే అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 20 రోజులవుతున్నా ప్రభుత్వ లక్ష్యంలో రెండు శాతమే కొనుగోలు చేశారంటే పరిస్థితి అవగతమవుతోంది.

జిల్లా వ్యాప్తంగా 126 కొనుగోలు కేంద్రాలు

యాసంగితో పోలిస్తే వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు పెరిగాయి. 126 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 108 కేంద్రాల్లో సాధారణ రకం.. సన్నాలకు 18 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 1.30లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేపట్టగా ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 2.8లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 1,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320 చెల్లించనుండగా బీ-గ్రేడ్‌కు రూ.2,300 చెల్లిస్తున్నారు. సన్నరకం ధాన్యానానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. అయితే కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పెడుతున్న కొర్రీలతో క్వింటాళ్‌కు రూ.1800 వరకే వస్తుండడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు.

కంప్యూటరీకరణలోనూ అలసత్వం

మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పెడుతున్న కొర్రీలతో రైతులు కల్లాల్లోనే ధాన్యం పెట్టుకుని ఆందోళనకు గురవుతూ దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2.8 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన 20 రోజుల్లో కేవలం 365 మంది రైతుల నుంచి 1717 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. వీరిలో 194 మంది రైతులకు చెందిన 926 టన్నులకు మాత్రమే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. దిగుబడిలో రెండు శాతం కొనుగోలు చేయగా పెట్టుకున్న లక్ష్యంలో ఒక శాతం మాత్రమే కంప్యూటరీకరణ పూర్తయిందంటే కొనుగోలు ప్రక్రియ నత్త నడకను తలపిస్తోంది.

ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి-అడికిచెర్ల డబుల్ రోడ్డు పనులు ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గుండ్లమడుగుతండా వద్ద ఆగిపోయిన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. అటవీ శాఖ అనుమతి లేకపోవడంతో జినుగుర్తి-గుండ్లమడుగు తండా 700 మీటర్లు, గుండ్లమడుగు తండా-పెద్దేముల్ మండలం అడికిచెర్ల మధ్య మూడు కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు పనుల్లో జాప్యం అవుతున్నాయన్నారు. ఇప్పటికే అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడామని త్వరలోనే అనుమతులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివరాలు సేకరించామన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.7.45కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం మండల పరిధిలోని బైపాస్‌రోడ్డు పనులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. బైపాస్ రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయానని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని పత్రాలు లేని ట్రాక్టర్లను సీజ్ చేస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. ప్రస్తుతం తాండూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక పర్మిషన్ ఉందన్నారు. ఇష్టానుసారంగా ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వొద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, రేంజ్ అధికారి శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ శివకుమార్, తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ తదితరులు ఉన్నారు.

మెనూ పాటించాలి

యాలాల: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏర్పాట్లలో పరిశుభ్రత తప్పక పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని అగ్గనూరు ఉన్నత పాఠశాలను తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైయినీ కలెక్టర్ ఉమా హారతితో కలిసి తనిఖీ చేశారు. భోజనానికి వినియోగించే బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన విషయంలో ఎలాంటి ఫిర్యాదులు, సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం వంటగది, పరిశుభ్రతను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ వేణు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

మండల పరిధిలోని అక్కంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం, తేమ శాతం తదితర అంశాల విషయమై రైతులతో మాట్లాడారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చెన్నారం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ట్రైయినీ కలెక్టర్ ఉమా హారతి, తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ వేణు ఉన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

బషీరాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తూకాల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోనలి కాశీంపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఎక్కడైన తూకాలు వేసేవారు దోపిడీ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెంటర్ల వద్ద రైతులకు కనీస వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహన్ బాబు, తహసీల్దార్ వై.వెంకటేష్, ఏపీఎం పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: విద్యార్థిని అడిగి భోజన వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



జినుగుర్తి-అడికిచెర్ల రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ఉమాశంకర్ ప్రసాద్

అంతర్జాతీయ ప్రమాణాలతో 'కోహెడ'



డీపీఆర్‌ను పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్ తదితరులు

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు ఉదయ్‌కుమార్

తుర్కయంజాల్: కొహెడలో నూతన మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. కొహెడలో నిర్మించనున్న మార్కెట్ స్థలాన్ని శుక్రవారం నూతన పాలకవర్గం, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడేలా అన్ని రకాల సదుపాయాలతో పాటు దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద మార్కెట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం ద్వారా ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయని చెప్పారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సంబంధిత అధికారులతో సమావేశం ఉంటుందని వివరించారు. అంతకు ముందు ఫేజ్-1 కింద చేపట్టే నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు అంజయ్య, జైపాల్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, గణేశ్‌నాయక్, రఘుపతిరెడ్డి, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, రాష్ట్ర మార్కెటింగ్ అదనపు సంచాలకుడు ఆర్.లక్ష్మణుడు, ప్రాంతీయ సంచాలకుడు ఇ.మల్లేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్, ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్, డీఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం

కందుకూరు: ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి డిప్యూటీ కలెక్టర్ పద్మావతి శుక్రవారం ఆర్డీఓ అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఆయా మండలాల్లో జరుగుతున్న ఓటరు నమోదు వివరాలను తెలుసుకున్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము లి.,
ధారూరు, వికారాబాద్ జిల్లా, ధారూరు, కోటపల్లి రోడ్డు.

రైస్ మిల్ (3) టన్స్ కెపాసిటీ మరియు (1500) మెట్రిక్ టన్స్ గోదాం లీజుకు ఇవ్వబడును

1) ఆసక్తిగల వారు రైస్ మిల్ నడుపుటకు (5 సంవత్సరాల) అనుభవం ఉన్న వ్యాపారస్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడును. 2) డిపాజిట్ రూ. 50,000/- DD తీయవలెను. ఈ డబ్బులు తిరిగి ఇవ్వబడును. 3) లీజు దరఖాస్తు ఫారమును మా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము, ధారూరు ఆఫీస్‌లో రూ.500/- చెల్లించి తీసుకోగలరు. 4) తేది: 28-11-2024 ఉదయం 11:30 నిమిషాలలోపు దరఖాస్తు ప్రతిని పి.ఏ.సి.ఎస్. ధారూరు సంఘములో సమర్పించవలెను. అట్టి దరఖాస్తులను అదేరోజు మధ్యాహ్నం 3:00 గంటలకు తెరిచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సాయంత్రం 5.00 గంటలకు అధిక టెండర్ వేసిన టెండరుదారులను ప్రకటించబడును.

-: టెండరు వేయవలసిన చిరునామా:-
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము
ధారూరు, వికారాబాద్ జిల్లా-501121. టెలిఫోన్ ఎక్స్చేంజ్ బ్యాక్ సైడ్, ధారూరు. సెల్ నంబర్: 7674004979, 9010200308

క్లుప్తంగా

వరి కొయ్యలను కాల్చొద్దు



దౌల్తాబాద్ శివారులో వరి కొయ్యలను కాల్చుతున్న రైతు

దౌల్తాబాద్: పొలాల్లో వరి కోతలు కోసిన తర్వాత ఉన్న కొయ్యలను కాల్చవద్దని వ్యవసాయ అధికారి లావణ్య శుక్రవారం సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి మేలు చేసే మిత్రపు రుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయి. అలా కాకుండా రైతులు పొలంలోనే వరి కొయ్యలను గడ్డిని కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని పంట దిగుబడి పెరుగుతుందని ఏఓ తెలిపారు.

సర్వేకు సహకరించండి



నిజాంపేట్ మేడిపల్లిలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

పూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శమని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాల ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించడంతో పాటుగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ఈ సర్వే ఉపయోగ పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కులగణనపై స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం తీసుకురావడమే లక్ష్యంగా రాహుల్ గాంధీ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, తిర్మల్‌రెడ్డి, ఎన్యుమరేటర్లు రవికుమార్, బందయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీకి యత్నం

తలుపులు విరగ్గొట్టిన దుండగులు



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలో టీవీని దొంగిలించడానికి దుండగులు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో తరగతి గది తలుపులు పగలగొట్టిన సంఘటన మండల పరిధిలోని హస్నాబాద్‌లో చోటు చేసుకుంది. బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం శుభ్రం చేయడానికి వచ్చిన మహిళా సిబ్బంది తలుపు పగలగొట్టడం గమనించి ఉపాధ్యాయులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. వెంటనే గ్రామస్తులు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అఫ్రూ బేగం వచ్చి పరిశీలించారు. విద్యార్థుల కోసం టీవీ ద్వారా పాఠాలు బోధించే తరగతి గది తలుపులు విరగొట్టారని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. ఘటనాస్థలిని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భీములు తదితరులు పరిశీలించారు.

పోలీసు పహారా.. ముగింపేలా?



బాపల్లి వద్ద సేదతీరుతున్న పోలీసులు



వాహనాల తనిఖీలో..

బొంరాస్‌పేట: లగచర్ల ఘటన పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఘటన రోజు నుంచి మండల పరిధిలోని తుంకిమెట్ల కూడలి, జాతీయ రహదారి, బాపల్లి కూడలితోపాటు పలు చోట్ల నిత్యం పోలీసుల పహారా కొనసాగుతోంది. ప్రజా సంఘాలు, ఇతర పార్టీల నాయకుల పరామర్శలకు ప్రభుత్వం అనుమతి లేదని అడ్డగిస్తున్నారు. నిత్యం రాత్రి, పగలు సుమారు 30 మందితోపాటు, ప్రత్యేక సందర్భాల్లో వంద వరకు పోలీసులుంటున్నారు. ఉదయం, రాత్రి వంతుల వారీగా విధుల్లో ఉంటున్నారు. తిండి తిప్పలు లేకుండా, కుటుంబాలను వదిలి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు మదన పడుతున్నారు. మహిళా పోలీసులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తుంకిమెట్ల కూడలిలో బందోబస్తు

సమన్వయంతో పని చేయాలి

అధికారులకు సూచించిన కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతగిరి: అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధరణి, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, పాఠశాల తనిఖీలు తదితర అంశాలపై తహసీల్దారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే పథకాలను అమలు పరచాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించే క్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలలో కచ్చితంగా సన్న బియ్యాన్ని అందించి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారానికి 3 సమయాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించారు. నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్వే నిర్వహించిన అనంతరం ఫారాలను తప్పని సరిగా ఎంపీడీఓ కార్యాలయాలకు అందించేలా ఎన్యుమరేటర్లకు సూచించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, సీపీఓ అశోక్, వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప



తరగతి గదిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దుద్యాల్: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మలేరియా, ఫైలేరియా కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పకీరప్ప విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. తరగతి గదులలో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. అలాగే పాఠశాల ఆవరణలో దోమలు ప్రబలకుండా రసాయనాలు స్ప్రే చేయించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఇటీవల చలి తీవ్రత పెరుగుతుండడంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్వెటర్లు, దుప్పట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాఘవేందర్, వార్డెన్ ఖాజా, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

గోనె సంచుల కొరత ఉండొద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

యాలాల: రైతులకు గోనె సంచుల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దేవనూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారని స్థానిక డీసీఎంఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరి తేమ శాతాన్ని పరిశీలించారు. వరి కొనుగోలు చేసేందుకు రైతులకు కొత్తగా పంపిణీ చేసిన గోనె సంచులను అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డీసీఎంఎస్ నిర్వాహకులకు ఏ మిల్లును కేటాయించారని సిబ్బందిని అడిగారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిచరణ్, డీసీఎంఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కంట్రోలర్ ఆత్మహత్య

ఉన్నతాధికారుల ఒత్తిళ్లే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



భూపతిరెడ్డి (ఫైల్)

పరిగి: పరిగి డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కంట్రోలర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రంగంపల్లిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూపతిరెడ్డి(55) పరిగి డిపోలో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల వేధింపుల కారణంగా రెండు రోజులుగా డ్యూటీకి వెళ్లడంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విధుల నిర్వహణలో వేధింపులు ఎక్కువయ్యాయని మదనపడుతున్నాడని చెప్పారు. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. నగరానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు.

పేదలకు అండగా ఉంటాం

దోమ: గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి తాము అండగా ఉంటామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన బాలమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నేతలు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఆరు గ్యారెంటీలు ప్రతి పేద కుటుంబానికి అందించేందుకు శ్రద్ధ తీసుకుంటామన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు కూడా రాబోతున్నాయని, ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించేలా శ్రద్ధ తీసుకుంటామన్నారు. పేద కుటుంబాలు ఎలాంటి అధైర్యాన్ని కొల్పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చంద్రశేఖర్, మహేశ్, ఇంతియాజ్, యాదయ్య, ప్రభు, బషీర్, హైమద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తాండూరులో కాలుష్య అంచనా

పరికరాలను అమర్చిన పీసీబీ అధికారులు



పోలీస్‌స్టేషన్‌పై కాలుష్య అంచనా పరికరాన్ని ఏర్పాటు చేసిన పీసీబీ సిబ్బంది

తాండూరు టౌన్: కాలుష్యాన్ని అంచనా వేసేందుకు పొల్యూషన్ బోర్డు సిబ్బంది(పీసీబీ) శుక్రవారం తాండూరు పట్టణంలో రెండుచోట్ల పరికరాలను అమర్చారు. వీటితో 24 గంటల్లో గాలిలో కాలుష్యం ఏ మేరకు ఉందో అంచనా వేయనున్నారు. ఈ సందర్భంగా పీసీబీ శాస్త్రవేత్త జీమోతా వాహన మాట్లాడుతూ.. గాలిలో నాణ్యతను, కాలుష్యాన్ని గుర్తించేందుకు ఈ పరికరాలను అమర్చినట్లు తెలిపారు. ప్రతి ఏడాది కాలుష్య అంచనా పరికరాలతో గాలి నాణ్యతను పరీక్షిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌పై ఒకటి, పాత తాండూరులో మరొక పరికరాన్ని అమర్చినట్లు వివరించారు. 24 గంటల్లో నమోదైన కాలుష్యాన్ని నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు.

పాముకాటుతో చిన్నారి మృతి

- ఆరుబయట ఆడుకుంటుండగా కాటేసిన నాగుపాము
- గంగాసాగర్‌లో విషాదం



సహస్ర (ఫైల్)

యాలాల: ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని నాగుపాము కాటేయడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ విషాద సంఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలం గంగాసాగర్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజిలప్ప, నర్సమ్మ దంపతుల పెద్ద కూతురు సహస్ర(7) స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. కాగా శుక్రవారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని నాగుపాము కాటేసింది. దీంతో చిన్నారి తనను ఎదో కరిచిందని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆందోళన చెందిన వారు సమీపంలో గాలించగా నాగుపాము కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు పామును చంపేసి హుటాహుటిన చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మలుపులు.. ప్రమాదపు సూచికలు



అల్లాపూర్ చెరువుకట్టపై మలుపు

దౌల్తాబాద్: మండలంలోని గుముడాల, అల్లాపూర్ గ్రామాల్లోని చెరువుకట్టలపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దౌల్తాబాద్ నుంచి గుముడాల మీదుగా అల్లాపూర్ గ్రామం వరకు రెండు గ్రామాల చెరువుకట్టలు ఉన్నాయి. ఈ చెరువుకట్టలపై నుంచి ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఈ చెరువుకట్టలపై మలుపులతో పాటు కట్ట పక్కనే చెట్లు మొలిచాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకముందే ఈ రెండు గ్రామాల చెరువు కట్టలపై చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయంలో ఉన్నతాధికారుల పూజలు



స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఆలయంలో జడ్జి శ్రీకాంత్ దంపతులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఆయనతో అర్చన చేయించి తీర్థ, ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు. అలాగే ఉదయం స్వామి వారిని వికారాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ దంపతులు దర్శించుకున్నారు.

PUBLIC NOTICE

This is to inform to the entire General Public that, we the under signed signitaries obtained DTCP Permission for Extent of A.C.7.01 Gts. in Sy.No. 102/P & 103/P for preparing (Making) Lay-out for 78 Plots. Vide Lr.Roc.No.3491/1736/2023/e Panchayath Pudur Village & Mandal, Vikarabad District. Dt. 21.04.2023 (Draft TLP.No. 66/2023/H) Again we Applied for Revised permission on 25.10.2024 from the Same Gramapanchayath i.e. Pudur (Village&Mandal) for Sy.No. 100/P to an extent of AC.1.20 gts adding the same is total A.C.8.21 Gts.

If any person having any objections may notify the same to the Secretary Gramapanchayath Pudur and DTCP/TPO Municipality-Vikarabad. Within 15 days from the date of this notice with proper documents along with a written form of objections.

Dt. 22.11.2024
Place: Pudur

Sd/- Gunnala Laxma Reddy
Sd/- Yampalla Sanjeeva Reddy
Sd/- Anne Usha Rani
Sd/- Veerapaneni Subramanyam

M/s Vrujhana Infra Structures LLP.
83191/146,2,3,4/Flat No. 204, B.9
Sai Surabhi Awas, Madhuranagar,
Hyderabad. Telangana - 500038
Cell: 9848449665

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K.
Ph: 9160900024, 9640400073
[SCA24000672]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి ఏదైన ప్రత్యుత్తరం ఇవ్వవలసిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి

రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలి

- ఐద్వా నాయకులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి
- ఫార్మా బాధిత గ్రామాల్లో పర్యటన
- గిరిజనులకు అండగా ఉంటామని హామీ



రోటిబండ తండాలో బాధితులతో మాట్లాడుతున్న ఐద్వా బృంద సభ్యులు

దుద్యాల్: లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండా, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో రైతుల అంగీకారం లేకుండా బలవంతంగా చేస్తున్న భూ సేకరణను వెంటనే ఆపాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఫార్మా బాధిత గ్రామాలను సందర్శించిన వారు గిరిజనులు, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోటిబండతండా, పులిచర్లకుంటతండాల్లోని ఇళ్లకు వెళ్లి మహిళలతో మాట్లాడారు. ఈనెల 11న లగచర్ల ఘటన అనంతరం జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు మాట్లాడుతూ.. ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి గ్రామాల్లోకి చేరుకున్న పోలీసులు కరెంటు సరఫరా నిలిపేసి, అనుమానితులను వెతికే క్రమంలో అసభ్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ అనుమతి లేకుండా అధికారులు సర్వే చేయడం, భూములు తీసుకుంటామని గట్టిగా చెప్పడంతోనే బాధితులు ఆగ్రహానికి లోనయ్యారని వివరించారు. బలవంతంగా భూములు లాక్కోవడాన్ని సహించేది లేదని స్పష్టంచేశారు. తరతరాలుగా బతుకుతున్న పొలాలు, ఇళ్లను వదిలి ఎక్కడి వెళ్లాలని ప్రశ్నించారు. గిరిజనుల జీవితాలను నాశనం చేసే ఫార్మా కంపెనీలను అనుమతించేది లేదని తెగేసి చెప్పారు. అనంతరం ఐద్వా ప్రతినిధులు మాట్లాడుతూ.. పోలీసుల అనుచిత వైఖరిపై రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గిరిజనులకు అండగా ఉంటామన్నారు. ఫార్మా కోసం భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా లేరని, వారి అంగీకారంతోనే భూములు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూనిర్వాసితులపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశలత, జిల్లా కార్యదర్శి అనసూయ ఉన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు ఏవీ?

- బహిరంగ మార్కెట్లో కొనడంతో రైతులకు భారం
- అకాల వర్షాలతో కల్లాల్లోనే ధాన్యం తడిసే ప్రమాదం



గుముడాలలో ధాన్యం రాశులపై టార్పాలిన్లు

దౌల్తాబాద్: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యంపై కప్పే టార్పాలిన్(కవర్లు) లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వ్యవసాయ పరికరాల్లో టార్పాలిన్లకు మంగళం పాడారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఇప్పుడైనా టార్పాలిన్లు పంపిణీ చేస్తారన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. పంట కోతల సమయం ప్రారంభమైనందున ధాన్యం ఆరబెట్టేందుకు అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేయడంతో వాటిని బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసేందుకు రైతులకు తలకు మించిన భారంగా మారింది. గతంలో ప్రభుత్వాలు రైతులకు 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా చేశాయి.

5 వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలో బోరుబావుల కింద, చెరువుల కింద వరి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ధాన్యం పండించిన రైతులకు టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు రెండు సార్లు అకాల వర్షాలు కురిశాయి. దీంతో కేంద్రాల్లో ఉన్న ధాన్యంతో పాటు పొలాల్లో ఉన్న వడ్లు తడిశాయి. రైతులకు సబ్సిడీ టార్పాలిన్లు లేక మొత్తం ధర చెల్లించి బయట దుకాణాలలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.